# ఊహాపోహాలు

రచన.:
శ్రీ కే. వి. రమణ

"ఏమండీ!"

"ఏం?....ఆఫీసునుండి రాగానే మొదలెట్టావో?"

"'ఏమండీ' అని మిమ్మల్ని పిలిస్తేనే పాపం. నోరార మృదువుగా పిలిచాను. మోటగా మొదలు పెట్టారు సంభాషణ."

"సరేలే! నీ ఏడుపేమిటి?"

"మృదువుగా పిలిస్తే ఏడుపుగానే వుంటుది లెండి?"

"సరేలే. నాదేతప్పు. ఇప్పుడు చెప్పు. సంగతేమిటి?"

"ఎన్నాళ్ళనుండి యీ పని చేస్తున్నారు?"

"ఏం పని?"

"అదే! నా చేతనే చెప్పించాలని చూస్తున్నారా?"

"అసలేం పనో చెప్పు?"

"అదేనండీ. మీరు ప్రతీరోజూ ఆఫీసుకి వెళ్లేటప్పుడు చేశేపని."

"అంటే అఫీసులో చేశేపనా?"

"కాదండీ. ఇంటినుండి ఆఫీసుకి బయలుదేరే టప్పుడు."

"అప్పుడా! భోజనంచేసి ఆఫీసుకు వెళుతున్నాను."

"భోజనం చేసిన తరువాత డ్రెస్ చేసుకుని వాకిట్లోకి వెళ్ళినప్పుడు ఏం చేస్తున్నారని అడుగుతున్నాను."

"వాకిట్లో ఏమీ చెయ్యటం లేదే నేను! తిన్నగా ఆఫీసుకే పోతున్నాను."

"నిజంగానా?"

"నిజంగానే!"

"బాగా జ్ఞాపకం చేసుకోండి."

"నాకు బాగా జ్ఞాపకం వుంది. ముసలివాడ్ని కాదుగా మరచిపోవడానికి?"

"మరచిపోవడానికి ముసలివాళ్లు కానక్కర్లేదు."

"పోనీలెండి జరిగిపోయిన రోజుల సంగతి యిప్పుడెందుకు గాని - ప్రొద్దున్న ఏమిచేశారో చెప్పండి."

"నే నేమీ చేయలేదే?"

"ఏమీ చేయలేదూ?"

"ఏమీ చేయలేదని చెప్పటంలేదూ?"

"చెప్పారనుకోండి. సరే నేను చెప్పుతాను - మీరేం చేశారో. వినండి."

"నేను వినడానికి సిద్ధంగా లేను."

"ఎందుకని?"

"ఆఫీసునుండి యిప్పుడే వస్తున్నాను కాబట్టి."

"అయితే?"

"బాగా అలసిపోయివున్నాను."

"చిన్నమాటే లెండి. ఇదివిని వెళ్ళండి."

"సరే చెప్పేదేదో తొందరగా చెప్పు."

"చెప్పనా?"

"చెప్పమంటుంటే?"

"అబ్బ! ఇంతదానికే అంతకోపమా అండి?"

"నా కేమీ కోపం లేదులే!"

"సరేలే! నే చెప్పేది జాగ్రత్తగా వినండి. ప్రొద్దున్న వాకిట్లోకి వెళ్ళాక ఎందుకు నవ్వారు?"

"నేనా?"

"మీరే!"

"నేను నవ్వలేదే?"

"అదిగో, నవ్వే నవ్వ లేదంటున్నారు."

"అబద్ధం ఆడవలసిన కర్మ నాకేం పట్టింది?"

"కర్మ కాకపోతే మీ అబద్ధ మేమిటి?"

"నేను అబద్ధం ఆడలేదు."

"అబద్ధం ఆడలేదూ? ఉదయం భోజనంచేసి డ్రెస్ చేసుకుని 10-30 గంటలకి వాకిట్లోకి వెళ్ళారు. అక్కడ మీరు ఆగారు. అప్పుడు మీరు నవ్వలేదూ?"

"నవ్వలేదంటూంటే నీ క్కాదూ? నా చేత అబద్ధానే నిజంగా చెప్పించదలచుకొన్నావా?"

"సరే లెండి! మీరు నవ్వలేదనే అనుకుందాం. మన పెళ్ళి అయి నెల రోజులుకూడ అవలేదు. అప్పుడే ఆ అమ్మాయికేసి చూసి నవ్వడ మెందుకండీ."

"నేనా?"

"ఔను! మీరే! అంత ఆశ్చర్యపడతా రెందుకు?

ఈ విషయం యింతవరకూ ఎవరికీ తెలియదనుకుంటున్నారేం?''

"రమా! నేను నిజంగా నవ్వలేదు.''

"నవ్వలేదేం? నా కళ్ళు కప్పివేయాలని చూస్తున్నారా?''

"నిజంగా రమా! నా మాట నమ్ము. ఇంతకీ నువ్వనేదేమిటి?''

"మీ మాటను నేనెలా నమ్మను? మీరు అటుచూసి నవ్వకపోతే ఆ ఎదురింటి అమ్మాయి ఎందుకు నవ్వుతుంది? ఇన్నాళ్ళనుంచి నేను యిది గమనించనే లేదు.''

"రమా! ఎందుకీ వూహాపోహలు? నన్ను నమ్ము''

"నమ్మబట్టే యిలా జరుగుతుంది. మగవాళ్ళ మాటలు తేటిమాటలని వూరికే అన్నారా? ఆడవాళ్ళతో ఎన్ని అబద్ధాలాడతారో ఆ బ్రహ్మకి కూడ తెలియదేమో!''

"సరేలే, రమా! 'తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్ళే నన్నట్లు,' నీ పట్టుదలను విడిచిపెట్టనంటావు. కానియ్యి, ఇదిగో రమా! నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నాకే తెలియదు.''

"నన్ను మాయకురాలినిగా చేసి మీరు యిన్ని ఆటలు ఆడుతున్నాడు.''

రమ ఏడుపు ముఖం పెట్టింది. కాపురానికి నూతనంగా వచ్చిన మగువ ఆమె.

రమణ యింట్లోకి వెళ్ళిపోయాడు. ఆ రోజు యింట్లో కాఫీ, టిఫిను లభించలేదతనికి. భార్య తెస్తుందేమోనని అతడు తన రూములో కూర్చుని ఎదురు చూశాడు. కాని వాంఛిత పదార్థాలు రాకపోయేటప్పటికి అతడు డ్రెస్ చేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

సాయంసమయము. అస్తమిస్తున్న సూర్యుని రాగ కిరణాలు. కవులు వర్ణించినట్లుగా పక్షుల కలకలా రావాలు గాని, నీరు తెచ్చే స్త్రీల కిల కిల నాదాలు, కింకిణీ ధ్వనులు గాని అతనికి వినపడలేదు.

తన భార్య హృదయంలో అప్పుడే అపోహ బయలుదేరింది. ఆమెకు ఎలా నచ్చచెప్పటం - తను నవ్వలేదని?

తన భర్త యితర స్త్రీలను చూసి నవ్వితే ఏ స్త్రీ సహిస్తుంది. తన భర్తకైనా సిగ్గు వుండవద్దూ? భార్యలేదు గనకనా యితర స్త్రీలకేసి చూసి నవ్వడానికి? తనలో అందం తక్కువనా - ఆ ఎదురింటి అమ్మాయిని చూసి నవ్వడము? తనకంటె ఆ అమ్మాయిలో ఏమి విశేషముందని? ఆ అమ్మాయి క్రిస్టియన్ యువతి - తను ఆంధ్ర స్త్రీ. ఆ అమ్మాయికి రెండు జడలు. తనకో? ఒక్కటే జడ - పొడవు పాటిది. ఆ అమ్మాయికి ముఖం మీద అంగుళం ఎత్తున ఫేస్‌పౌడరు. ఇంతేగా ప్రత్యేకతలు ఆమెలో వున్నది!

రమ సహించలేక పోయింది - తన భర్త ఆమెకేసి చూసి నవ్వటం. తన భర్త నవ్వాడో లేదో నిజంగా ఆమె చూడలేదు. కాని తన భర్త వాకిట్లో నిలబడేటప్పుడు ఆ అమ్మాయి నవ్వడం చూసింది రమ.

పోనీ, ఆ అమ్మాయికైనా బుద్ధి వుండనక్కరలేదా? రమణకు భార్య వున్నదని తెలిసికూడ నవ్వటమా? బహుశా క్రిస్టియన్ యువతులందరూ అంతేనేమో?

రమ వంటచేసి తన భర్తగురించి ఎదురుచూస్తూ వుంది. అతను ఎంతకీ రాలేదు. కొంపదీసి ఎక్కడికైనా వెళ్ళి పోయాడేమో - తనమీద అలిగి! తను ఎంత పాపిష్టిది! పెళ్ళి అయిన మొదటి రోజుల్లోనే యీ దెబ్బలాటలా? ఎవరైనా బంధువులు వింటె నవ్విపోరూ?

రాత్రి దొమ్మిది గంటలు. రమణ యింతకు ముందెప్పుడూ అంతవరకూ బయట తిరిగి వుండలేదు. ఈ రోజింతవరకూ యింటికి రాకపోవడానికి కారణం. సినిమాకు వెళ్ళాడేమో?

తెల్లటి వెన్నెల. చల్లటిగాలి. హేమంత ఋతువు. మిణుకు మిణుకు మంటున్న చిన్న తారకలు. ప్రకాశవంతంగా మెరుస్తున్న పెద్ద నక్షత్రాలు.

పదిగంటలు కొట్టింది గోడగడియారం. బయట పోతున్న రిక్షాలవైపు చూస్తూ కూర్చుంది వరండాలో రమ.

రమణ వచ్చాడు. వాకిట్లోనుండి యింట్లోకి అడుగు పెట్టాడు.

"ఏమండీ! ఇలా మంచులో తిరిగితే ఆరోగ్యం పాడైపోదూ?' - అనాలనుకుంది. తన భర్త చేసినపని జ్ఞాపకంవచ్చి ఏమీ మాట్లాడలేక పోయింది.

రమణ రమను పల్కరించాలనుకున్నాడు. తప్పు చేసి

నది, తన భార్య. ఆడది ముందు మాట్లాడకుండా తనే ముందుగా ఎలా మాట్లాడటం? స్త్రీకే అంత అభిమానం వున్నట్లయితే పురుషుడైన తన కెందుకు అభిమానం వుండకూడదు? ఆడదానికి అదీం అపోహ ఎందుకు?

రమణ మాట్లాడకుండా తన గదిలోనికి పోయి కూర్చున్నాడు - భోజనం వస్తుందేమోనని.

రమ వంటయింట్లో కూర్చుంది - తన భర్త పిలుస్తాడేమోనని, కాని పిలువలేదు.

ఆ నవదంపతులు అలానే ప్రతీక్షిస్తూ నిద్రపోయారు. వీధిలోనుంచి ఒక గ్రామసింహం వచ్చి వంటయింట్లో దూరింది. మెల్లగా వండింది కాస్తా ఆరగించి పోయింది. ఆమెకు మెలకువరాలేదు. అతగాడికి కూడా మెలకువ రానేలేదు.

శీతకాలం. చలి ఎక్కువగా వుంది. తలుపులు బార్లా తెరిచేవున్నాయి.

మెల్లగా తెల్లవారిపోయింది. రమ కాఫీ. టిఫిను భర్త గదిలోవుంచి వచ్చింది. అతడు మాట్లాడకుండా అవి పుచ్చుకున్నాడు.

తన భర్త తనను పలకరిస్తాడేమోనని ఎదురు చూసింది. కాని పిలవలేదు.

అఫీసు టైమయింది. రమణ డ్రెస్ చేసుకుని ఆఫీసుకు బయలుదేరి వెళ్ళిపోయాడు . భోజనం చేయకుండానే?

రమ అతడిని భోజనం చేయమని బలవంతపర్చలేదు. భోజనం చేయకపోతే ఎవరికీ నష్టం?

తన భర్త ఆఫీసుకి వెళ్ళిన వెంటనే ఆమె వరండాలోనికి వచ్చి నిల్చుంది. ఎదురింటి అమ్మాయి నిలబడి వుంది. రమ బయటకు వచ్చి రోడ్డుమీద నిలబడి తన యింటికేసి చూసింది. రమ ప్రక్కయింటి అబ్బాయి నవ్వుతున్నాడు. ఆ క్రిస్టియన్ యువతికూడ నవ్వుతూ వుంది. ఇదన్నమాట అసలు విషయం. ఎదురింటి అమ్మాయి తన ప్రక్కయింటిలోనున్న అబ్బాయిని చూసి నవ్వుతుందన్నమాట! తను అపోహ పడింది. ఎంత అపరాధం చేసింది! తన భర్త ఆఫీసునుండి రాగానే తాను క్షమాపణ కోరుకోవాలి.



తన భర్తే ఆ అమ్మాయిని చూసి నవ్వాడనుకుంది. తన భర్త చెప్పనే చెప్పాడు - 'తరువాత నీవే బాధ పడతావు'-అని. అతనిమాటలు నమ్మకుండా తను ఎంత అపరాధం చేసింది.

మధ్యాహ్నంపూట ఆఫీసు 'బోయ్' ని కాఫీ తీసుక రమ్మని తన యింటికి పంపించేవాడు రమణ. మధ్యాహ్నం రెండు అయినప్పటికీ ఆ బోయ్ యింకా రాలేదు. రోడ్డు వైపుగానే చూస్తూవుంది.

సాయంకాలం అయిదున్నర పైనే అయింది. తన భర్త యింకా రాలేదే? ప్రొద్దున్న భోజనంకూడా చేయలేదు. మధ్యాహ్నం కాఫీకూడ యింటినుండి రప్పించుకోలేదు. ఎంత ఆకలితో బాధ పడ్తున్నారో?

ఆఫీసుకి వెళ్ళి పిలుచుక వద్దామన్నాసరే ఆ ఆఫీసు ఎక్కడుందో కూడా తెలియదే తనకు? ఎలా?

సాయంకాలంకూడా గడచిపోయింది. ఎదురింటి కేసి చూసింది. ఆ అమ్మాయి వుండే యింటికి తాళం వేసి వుంది. ఎక్కడికి వెళ్ళింది చెప్మా! ఆ అమ్మాయి యింతకుముందు సాయంత్రంపూటల్లో ఎక్కడకీ వెళ్ళేది కాదే!

రమకు ప్రతి చిన్నవిషయం మీద అనుమానమే. ఆమె రోడ్డుమీదికి వెళ్ళి తన ప్రక్కయింటికేసి చూసింది. ప్రక్కయింటి అబ్బాయి యింట్లోనే వున్నాడు. అయితే ఆ ఎదురింటి అమ్మాయి ఎక్కడికి వెళ్లినట్లు. రమణ యీసరికి ఆఫీసునుండి తిరిగి రావాల్సిందే! ఎందుక రాలేదు? ఆమెతో రమణ ఎక్కడికైనా....

రమ చాల విచారంగా వుంది. మొదట తన వూహలో వచ్చిన అపోహ తొలగిపోయింది. తన భర్త ఆమెకేసి చూసి నవ్వలేదన్నమాట నిజం! మరయితే ఆయన ఎక్కడికి వెళ్ళినట్లు?

రమ వూహలో రెండవ అపోహ బయలుదేరింది - ఆ క్రిస్టియన్ యువతితో కలిసి తన భర్త తిరుగుతున్నాడేమోనని.

రమ వరండాలో నుంచుని చూస్తుంది - ఆ క్రిస్టియన్ యువతి ఎప్పుడు వస్తుందోనని. ఆమెతోపాటు తన భర్త వస్తాడా రాడా అని. ఎంతసేపయినప్పటికీ తన భర్త రాలేదు! ఆ క్రిస్టియన్ యువతికూడా రాలేదు.

రమ వరండాలో కూర్చోలేక పోయింది. పడక గదిలోనికి వెళ్ళింది. తన దుర్భాగ్యానికి ఏడ్చింది.

ఇంటి వెనుక తోటనుండి మల్లెపూల వాసన. ముందు భాగాన్నుండి నైట్ క్వీన్ పువ్వుల వాసన. ఒక ప్రక్క విరహబాధ. మరొక ప్రక్క హేమంత ఋతువు.

ప్రక్కయింటి అబ్బాయి గదిలోనుండి ఏవో సర్దుకుంటున్నట్లు శబ్దమవుతూవుంది. అతడు గేయంగాబోలు పాడుకుంటున్నాడు. అది స్పష్టంగా వినపడుతూ వుంది ఆమెకు.

ప్రక్కింటి అబ్బాయి పాడటం మానేశాడు. రమ వరండాలోనికి వచ్చి నిల్చుంది. ప్రక్కింటి అబ్బాయి సామాను రిక్షామీద వేసుకుని వెళ్ళిపోతున్నాడు. ఎక్కడికో? బహుశా యిల్లు ఖాళీ చేసేశాడేమో!

రమ వంట యింట్లోకి వెళ్ళింది. సుమారు ఏడెనిమిది గంటలై యుంటుంది. ఆమె వంట వండటం ఎప్పుడో పూర్తిచేసింది. ఆమె అచ్చటనే కూర్చుండిపోయింది.

ప్రక్కింటి అబ్బాయి పాడిన రెండు గేయాలు ఆమె జ్ఞప్తిలోని కొచ్చాయి.

రమకు గడిచిన సంఘటనలన్నీ జ్ఞాపకం వచ్చాయి ఆమెకండ్లు మూసుకుని ఆలోచిస్తూ వుంది.

తన భర్త ప్రేమలో తన్ను పలకరిస్తూండేవాడు.

ముఖ్యంగా తను మరచిపోరానిది పెండ్లినాటి ఘట్టం.

ఆనాడు తనను పెండ్లికూతుర్ని చేశారు. తాను ఎంతగా సిగ్గుపడింది. తనస్నిగ్ధ గులాబీరేకువలె నున్న బుగ్గమీద కాటుకతో రాగి కాణీ అంత మచ్చపెట్టారు. అందవికారంగా కనపడిందా మచ్చ తనకు.

రమ తన భర్తను పెండ్లి పీటలమీద తొంగిచూసింది. తన భర్తకూడ అప్పుడే తొంగిచూశాడు. మిగుల సిగ్గుపడిందామె. తన పెదవులను నవ్వకుండా ఆపటానికి ప్రయత్నంచేసింది.

రమ తన ఆలోచనా ప్రపంచాన్నుండి బయటపడింది. తన భర్త గదిలో దీపం వెలుగుతూవుంది. ఇందాక ఆ గదిలో దీపం వెలుతూలేదే! అయితే దానిని ఎవరు వెలిగించారు?

(తరువాయి 19వ పేజీలో)

రమణ యింట్లో అడుగు పెట్టి వంటగది వద్దకు వెళ్ళీ, తన భార్య నిద్రపోతూ వుందని తెలుసుకొని, తన గదిలోనికి వెళ్ళి లైటు వెలిగించుతున్నాడని రమకేమి తెలుసు?

రమ భర్త గదివద్దకు వెళ్ళింది. లోనికి తొంగి చూసింది. భర్త కుర్చీలో కూర్చుని నిద్రపోతున్నాడు.

ఆమె లోనికి వెళ్ళి చూసింది. భర్త నిద్రపోతూనే వున్నాడు. టేబులు మీద ఒక కాగితం వుంది. దాని ప్రక్కనే సంపంగి పూలపొట్లం విప్పివుంది. దాని వాసన నలువైపుల వ్యాపిస్తూవుంది.

ఆ కాగితం తీసింది,అది తన తండ్రికి భర్త వ్రాసిన వుత్తరం.

మామయ్యా !

మీ అల్లుడు రమణ క్షేమంతోనే వున్నాడని తెల్పుతూ విచారంగా వ్రాస్తూవున్న వుత్తరం యిది.

రెండు రోజులనుండి మీ అమ్మాయి 'రమకు' నా మీద అపోహ కలిగింది.

మా యింటి కెదురుగా ఒక క్రిస్టయన్ అమ్మాయి వుంది. ఆ అమ్మాయిని చూసి నవ్వానని మీ అమ్మాయి నాతో వాదిస్తూ వున్నది. నేను నిజంగా ఆమెను చూసి నవ్వనేలేదు. అందువలన అమె యీరెండు రోజులనుండి నాతో మాట్లాడటం లేదు, మీరేవచ్చి మాయీ నూతన జీవితాన్ని చక్కపర్చగలరని ఆశిస్తూ యున్నాను.

మనసు బాగుండకనే నీరోజు సాయంత్రం అలా స్టేషను వైపు వెళ్ళాను. అక్కడే ఏడెనిమిది గంటల వరకూ అటూ యిటూ తిరిగాను. అప్పుడే రైలుబండి వచ్చింది. మా యింటి ఎదురుగావున్న అమ్మాయి, మా ప్రక్కింటి అబ్బాయి ఆ ట్రైను ఎక్కడం చూశాను. వాళ్లు వెళ్ళిపోతున్నందులకు నా కెంతో ఆనందంగా వుంది. ఇకమీదనైనా మా జీవితం నూతన పథాన్ని అందుకుంటుందని ఆశిస్తూన్నాను.

ఇప్పుడే స్టేషనునుండి యింటికి వచ్చాను. మీ అమ్మాయి వంటయింట్లో నిద్రపోతూవుంది. నా గదిలో కూర్చుని యీ వుత్తరం వ్రాస్తూన్నాను.

మీ కుమార్తెయందు నా కెంత ప్రేముందో నేను యీ వుత్తరంద్వారా వ్రాయలేని విషయం. నా హృదయాన్నడిగితే ఆదే చెబుతుంది.

తప్పకుండా వస్తారని ఆశిస్తూ వున్నాను.

ఇట్లు,
మీ 'రమణ.'

పాపం తన భర్త తను పల్కిన మాటలుగురించి ఎంత విచారించి వుంటారో! తను పొరపాటు చేసింది.

నిన్న సాయంకాలం తన భర్తకు కాఫీ-టిఫిను యివ్వలేదు, రాత్రి భోజనంకూడ లేదు. అలాగే మధ్యాహ్న - సాయంకాలాలు కూడ.

తన భర్త ముఖం విచారంగా వుంది తనుకూడ ఎంతో విచారంగా వుంది. తన తండ్రికివ్రాసిన ఆ వుత్తరాన్ని చింపి పారేసింది.

"ఏమండీ!"

"...................."

"ఏమండీ!" - మృదువుగా పిలిచింది.

"...................."

"ఏమండీ! లేవరూ?" మృదువుగా, విచారంగా పిలిచింది రమ; తట్టి లేపింది.

రమణ లేచాడు. భార్యవైపు చూశాడు. ఆమె చాల విచారంగా కనపడ్డది.

"నా తప్పు క్షమించండి."

రమణ హృదయం వికసించింది.

"రమా! నువ్వు తప్పు చెయ్యలేదు. పరిస్థితులు అలా కల్పించాయి. నా ప్రక్క చూడు."

రమ తన భర్త ముఖంలోనికి చూడలేకపోయింది. రమణ రమను దగ్గరగా తీసుకున్నాడు.

రమ రమణను వంటింటివైపు నడిపించుక వెళ్ళిపోయింది. ఇద్దరూ కిలకిలా నవ్వుతున్నారు ముదిత హృదయాలతో.

బల్లమీది సంపెంగ పూవులు వారిరువురను చూసీ తమలో తాము మెల్లగా నవ్వుకున్నాయి.